సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 31 । అక్టోబర్ । 2022



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

8లో

అరకులోయ మండలం వజ్రాల మెట్ట మలుపువద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.



కారడవిలో కాంతి రేఖలు

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మార్పు కోరుకుంటున్న గిరిజనం
- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు

8లో

నేడు జాతీయ ఐక్యతా దినోత్సవ ర్యాలీ

పాడేరు రూరల్: సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సోమవారం పాడేరులో జాతీయ ఐక్యతా దినోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపా రు. ఈ ర్యాలీ ఉదయం 7గంటలకు పట్టణంలోని తలార్‌సింగి జంక్షన్ వద్ద ప్రారంభమై పాత బస్టాండ్ అంబేడ్కర్ కూడలి వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

వీఎస్ఎస్ సభ్యుల వాటా ధనం విడుదలకు చర్యలు

రంపచోడవరం డీఎఫ్‌వో నరేందిరన్



వీఎస్ఎస్ సభ్యులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో నరేందిరన్

రంపచోడవరం: వన సంరక్షణ సమితు(వీఎస్ఎస్)ల్లో పనిచేసిన గిరిజనులకు రావాల్సిన వాటా ధనాన్ని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం డీఎఫ్‌వో జి.జి.నరేందిరన్ తెలిపారు. వాటా ధనంపై ఆదివారం దేవరపల్లిలో వీఎస్ఎస్ సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. 2012–13 ఆర్థిక సంవత్సరం నుంచి 2018–19 ఆర్థిక సంవత్సరం వరకు వెదురు నరకడంలో పాల్గొన్న సభ్యులకు వాటా ధనం చెల్లించవలసి ఉందన్నారు. ఎనిమిది వీఎస్ఎస్‌ల్లో సమావేశాలు పూర్తి చేసినట్టు తెలిపారు. దేవరపల్లి, సున్నంపాడు, రామన్నవలస, సంతవీధి, అద్దరివీధి, కుట్రవాడలతో పాటు మరో రెండు వీఎస్ఎస్‌లకు రూ. 37.08 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. వీఎస్ఎస్ సభ్యుల ఖాతాల్లో త్వరలో నగదు జమ అవుతుందని తెలిపారు. రంపచోడవరం అటవీ క్షేత్ర అధికారి ఎం.కరుణాకర్, మారేడుమిల్లి రేంజర్, బీడీవీ ప్రసాద్, డీఆర్‌వో జాన్‌బాబు, ఎఫ్ఆర్‌వో అశ్వినీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎన్‌టీ శ్రీను

జి.మాడుగుల: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. మండలంలో నుర్మతి పంచాయతీ వాకపల్లికి చెందిన పాంగి హయతి నిండు గర్భిణి. ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. వాహనంలో హయతిని తరలిస్తుండగా మార్గ మధ్యంలో జి.మాడుగుల దగ్గరలో ప్రసవించినట్టు ఈఎన్‌టీ శ్రీను తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఆయన చెప్పారు. హయతికి ఇది మొదటి కాన్పుని, తల్లీబిడ్డలను స్థానిక పీహెచ్‌సీలో వైద్యం నిమిత్తం తరలించామని ఆయన చెప్పారు.

హోమియో మందు పంపిణీ

అడ్డతీగల: గిరిజనుల్లో రోగ నిరోధక శక్తి పెంపునకు సేవాభారతి సంఘం ఆధ్వర్యంలో స్థానిక వనవాసీ కళ్యాణాశ్రమ్ కార్యాలయంలో ఆదివారం హోమియో మందు పంపిణీ చేశారు. రంపచోడవరం డివిజన్‌లోని 55 గ్రామాల వారికి ఈమందు అందజేశారు. వనవాసీ కళ్యాణాశ్రమ్ కార్యవర్గ సభ్యులు పాత్తూరి కృష్ణ, బొగ్గల కాటంరెడ్డి, వేణుం వెంకటరత్నం, కురసం రాజుబాబు పాల్గొన్నారు.

ఆధునిక వైద్యం.. అత్యవసర సేవలు

- రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ప్రత్యేక వైద్య నిపుణులు
- శరవేగంగా అదనపు భవన నిర్మాణ పనులు



రంపచోడవరం ఏరియా ఆస్పత్రి



నిర్మాణంలో ఉన్న అదనపు భవనం

రంపచోడవరం: డివిజన్ పరిధిలోని 11 మండలాల ప్రజలకు స్థానిక ఏరియా ఆస్పత్రే పెద్ద దిక్కు. ఇక్కడ అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో తరచూ రాజమహేంద్రవరం జనరల్ ఆస్పత్రి, కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేసే పరిస్థితి. అత్యవసరం వైద్యం అందించాల్సిన రోగులను 50 కిలోమీటర్ల దూరం తీసుకువెళ్లే సమయంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలో వైద్య సేవలను విస్తృతం చేశారు. ఏరియా ఆస్పత్రిలో ఆధునిక వైద్యం, అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేశారు. వీటిని నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.

అందుబాటులో ప్రత్యేక వైద్య నిపుణులు

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులతో పాటు 11 మంది ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. గతంలో ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు, ఇతర అత్యవసర కేసులను రాజమహేంద్రవరం రిఫర్ చేసే వారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు పూర్తి స్థాయిలో వైద్య నిపుణులు అందుబాటులో తెచ్చారు. దీంతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. హైరిస్క్ ప్రసవాలను సైతం చేసేందుకు గైనకాలాజిస్టులు డాక్టర్ కె.లక్ష్మి, కె.వీరబ్బాయిలు అందుబాటులో ఉన్నారు. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలూ కల్పించారు. చిన్న పిల్లల వైద్య నిపుణులుగా డాక్టర్ వి.జ్యోత్స్న, జనరల్ వైద్య నిపుణులుగా డాక్టర్ జె.కిరణ్ దుర్గాప్రసాద్, డాక్టర్ దుర్గా సాయి స్వరూప్, కంటి వైద్య నిపుణులుగా డాక్టర్ టి.లక్ష్మి, మత్తు వైద్య నిపుణులుగా బి.మేరీ రోహిణి, పాథాలాజిస్టుగా డాక్టర్ శ్రీవల్లీ సేవలందిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో చిన్న పిల్లల సంరక్షణకు ప్రత్యేక విభాగం కూడా ఉంది.

శరవేగంగా అదనపు భవన నిర్మాణం

టీడీపీ హయాంలో రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని 50 పడక నుంచి 100 పడకల స్థాయికి పెంచినట్టు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆ మేరకు కృషి జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సంకల్పించింది. దీనిలో భాగంగా అదనపు భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మరో మూడు నెలల్లో భవనం అందుబాటులోకి రానుంది. అలాగే ఆస్పత్రికి సమీపంలోనే మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే ఆదివాసీలకు మరింత అత్యాధునిక వైద్య సేవలు అన్ని అందుబాటులోకి వస్తాయి.

రిఫరల్ కేసుల సంఖ్య తగ్గింది



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేయడంతో రిఫరల్ కేసులు సంఖ్య తగ్గింది. సాధ్యమైనంత వరకు ఇక్కడే వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోంది. భవిష్యత్‌లో మరింత మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేస్తున్నాం

–డాక్టర్ ఎం.పార్వతి, ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి

వచ్చే నెలలో జగనన్న క్రీడా సంబరాలు

పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



జగనన్న క్రీడా సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యక్ష్మి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, క్రీడా అభివృద్ధి సంస్థ అధికారులు

పాడేరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబర్‌లో జగనన్న క్రీడా సంబరాలు నిర్వహించనున్నారు. ఈమేరకు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆదివారం వేర్వేరుగా ఆ సంబరాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ మెడికల కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, ఎంపీటీసీ సభ్యుడు దూసురి సన్యాసయ్య, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు, జిల్లా పాఠశాల ఫెడరేషన్ కార్యదర్శి పి.సూరిబాబు, జిల్లా క్రీడా సంయుక్త కార్యదర్శి టి.సాధు తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన జట్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారని తెలిపారు. జిల్లాలో నవంబర్ నెలలో జగనన్న క్రీడా సంబరాలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించినట్టు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 17 ఏళ్ల నిండిన క్రీడాకారులు అర్హులన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ పి.సూరిబాబు, జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.సింహాచలం, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా మెనూ అమలు

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- మూడు నెలలకు ఒక సారి డిప్యూటీ మేట్రిన్, వార్డెన్ బాధ్యతలు మరొకరికి అప్పగించాలి
- పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



సమావేశానికి హాజరైన అధికారులు, హెచ్‌ఎంలు,వార్డెన్లు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పక్కాగా అమలు చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. శనివారం రాత్రి ఐటీడీఏ సమావేశ మందిరంలో 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌డబ్ల్యూవోలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జీసీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతీ మూడు నెలలకూ డిప్యూటీ మేట్రిన్, వార్డెన్‌ల బాధ్యతను మరో ఉపాధ్యాయుడికి అప్పగించాలని పీవో ఆదేశించారు. నెలకోసారి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల క్రమశిక్షణ, విద్యా సామర్థ్యాలను వారికి తెలియజేయాలని సూచించారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో సీసీ కెమెరాలను వెంటనే ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మూమెంట్ రిజిష్టర్ నిర్వహించాలని తెలిపారు. టెండర్ల సమయంలో పొందుపరచిన విధంగానే నాణ్యమైన నిత్యావసర సరుకులు, గ్యాస్‌బండలను సకాలంలో ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయాలని జీసీసీ అధికారులకు ఆదేశించారు. ఫేషియల్ యాప్, బైజూస్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్ ప్రతీ విద్యార్థికీ పంపిణీ చేయాలని, విద్యాక్యాలెండరు, పాఠ్యాంశాల ప్రణాళిక సక్రమంగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు.

శ్రీహరికోట విజ్ఞాన యాత్రకు ..

గిరిజన విద్యాలయాల్లోని 8, 9, 10వ తరగతులకు చెందిన 120 మంది విద్యార్థులను త్వరలో శ్రీహరికోటకు విజ్ఞానయాత్రకు పంపిస్తామని, ప్రతీ పాఠశాలనుంచి ఒక విద్యార్థి పేరును సూచిస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హెచ్‌ఎంలను పీవో ఆదేశించారు. డిసెంబరు రెండో వారంలో గిరిజన విజ్ఞాన సంబరాలను ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. శీతాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటార్ హీటర్‌లను బాగుచేయించి, విద్యార్థులకు వేడినీటి సదుపాయం కల్పించాలన్నారు. తాగునీటి పథకాలు వినియోగంలోకి తేవాలని, మన బడి నాడు–నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాలకు రివాల్వింగ్‌ఫండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, నిధుల కొరత లేదని చెప్పారు. నాడు–నేడు పనులు వద్దని రద్దు చేస్తే ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తామని పీవో హెచ్చరించారు.

ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, డీఈవో పి.రమేష్, గిరిజన సంక్షేమశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస రెడ్డి, ఏటిడబ్ల్యూవోలు ఎల్.రజని, క్రాంతి కుమార్, మల్లికార్జునరావు,జయనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరో అందాల జాడ.. మాడగడ

- మాడగడ కొండలకు పోటెత్తున్న పర్యాటకులు
- సూర్యోదయం, మంచు సోయగాలు వీక్షిస్తూ తన్మయం



పాలసముద్రంలా దర్శనమిస్తున్న మాడగడ హిల్స్‌పై మంచు అందాలు



మాడగడ కొండలపై మంచు తెరలను చీల్చుకుంటూ సూర్యోదయం అవుతున్న దృశ్యాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: ప్రకృతి రమణీతకు పెట్టింది పేరైన మన్యంలో మరో టూరిస్ట్ స్పాట్‌కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయకు వస్తున్న పర్యాటకులు వారం రోజుల నుంచి మాడగడ కొండలకు పరుగులు తీస్తున్నారు. మాడగడకొండపై వేకువజామున మంచు తెరల మాటు నుంచి కనువిందు చేసే సూర్యోదయం, మంచు అందాలు పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. అరకులోయకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో మాడగడ హిల్స్ ఉన్నాయి. తారురోడ్డు సౌకర్యం ఉంది. దీంతో అరకులోయ ప్రాంతంలో బస చేసిన పర్యాటకులు వేకువజామునే ఆ కొండల వద్దకు చేరుకుని ఇక్కడ ప్రకృతి అందాలను వీక్షిస్తున్నారు. రోడ్డును ఆనుకుని కొండలు ఉండడంతో కాలినడక ఇబ్బందులు కూడా పర్యాటకులకు లేవు. కొంతమంది పర్యాటకులు రాత్రి చలిమంటలు వేసుకుంటూ అక్కడే బస చేస్తున్నారు. మాడగడ హిల్స్ అందాలను వీక్షించేందుకు వచ్చే పర్యాటకుల తాకిడి అరకులోయకు అధికమవడంతో అన్ని హోటళ్లు,రిసార్ట్‌లు,కాటేజీలు,అతిథి గృహాలకు ఆదరణ పెరిగింది. రాత్రి బస చేసే పర్యాటకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం మాడగడ హిల్స్‌లో సూర్యోదయం, పొగమంచు అందాలు,ప్రకృతి రమణీయత గురించి నెటిజన్లు తమ పోస్టుల్లో అద్భుతంగా వర్ణిస్తున్నారు. ఆదివారం ఉదయం 10గంటల వరకు పర్యాటకులు మాడగడ హిల్స్‌పై సందడి చేశారు. చింతపల్లి మండలం లంబసింగి ప్రాంతంలోని చెరువులవెనం,పాడేరు మండలం వంజంగి హిల్స్,హుకుంపేట మండలంలోని సీతమ్మకొండ ప్రాంతాల్లోని మంచు ప్రకృతి అందాలకు మాడగడ కొండలు పోటీపడుతున్నాయి.

ఆనంద డోలికల్లో.. మైమరచి

- కొండకోనల్లో ప్రకృతి సోయగాలకు పరవశించిన పర్యాటకులు
- టూరిస్టు స్పాట్‌లకు పోటెత్తిన జనం



తాజంగిలో బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు



పొద్దు తిరుగుడు పూల తోటలో ఫొటోలు తీసుకుంటూ..



అరకులోయ గిరిజన మ్యూజియం ప్రవేశద్వారం వద్ద ...



చీకుధార వద్ద పర్యాటకులు

సాక్షి,పాడేరు: కొండల్లో.. కోనల్లో.. అందాల పూతోటల్లో.. జలపాతాల లోయల్లో.. ప్రకృతి ప్రేమికులు పరవశించిపోయారు. మంచు అందాలను వీక్షిస్తూ, సూర్యోదయ సోయగాలను తిలకిస్తూ తన్మయత్వం పొందారు. ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం వేకువజాము నుంచే సందర్శకుల సందడి నెలకొంది. చింతపల్లి మండలం లంబసింగి నుంచి అనంతగిరి మండలం వరకు ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలు రద్దీగా మారాయి. లంబసింగి సమీపంలోని చెరువులవెనం, పాడేరు మండలం వంజంగి హిల్స్ ప్రాంతానికి కాలినడకన పర్యాటకులు చేరుకున్నారు. పాలసముద్రంలా దర్శనమిచ్చిన మంచు అందాలను తనివితీరా వీక్షించారు. పాడేరు ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మ పాదాలుగుడి, హుకుంపేట మండలంలోని మత్స్యగుండం క్షేత్రాల్లో పర్యాటకులు,భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఇక్కడ కార్తీక వనభోజనాల కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆంధ్రా ఊటీ అరకులోయ రెండు రోజుల నుంచి పర్యాటకులతో కళకళలాడుతోంది. పద్మాపురం గార్డెన్,గిరిజన మ్యూజియంలను పర్యాటకులు భారీగా సందర్శించారు. వేకువజామున మాడగడ హిల్స్ ప్రాంతంలో పొగమంచు అందాలను వీక్షించారు. పర్యాటకులంతా అన్ని పర్యాటక ప్రాంతాలలోను ఫుల్ జోష్‌గా సందడి చేశారు.

లంబసింగిలో...

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలుగా నమోదు కావడంతో మంచు దట్టంగా కురిసింది. పెద్ద సంఖ్యలో వచ్చిన పర్యాటకులు దట్టంగా కురుస్తున్న మంచు అందాలను ఆస్వాదించారు. సమీపంలోని చెరువులవేనం కొండల్లో పాల సంద్రాన్ని తలపించే మంచు మేఘాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. తాజంగి రిజర్వాయర్‌లో బోటు శికారు, జిప్‌లైన్ ఎక్కి పర్యాటకులు సంబరపడ్డారు.

బొర్రాకు పెరిగిన సందర్శకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. గతవారం 3,500 మంది సందర్శించగా, ఈ ఆదివారం 4 వేల మంది పర్యాటకులు వచ్చారు. రూ.3 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. కటికి, తాటిగుడ, సరియా జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్ సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో కళకళలాడాయి.

సరిహద్దుల్లో...

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతం డుడుమ జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. డుడుమ జలపాతం పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల కోలాహలం కనిపించింది. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.డుడుమ జలపాతం,జోలాపుట్టు జలాశయం,మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం,దేసిమా మ్యూజియంలను సందర్శించారు. కుటుంబాల సమేతంగా వనభోజనాలు చేశారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు సరిహద్దు రోడ్లన్నీ పర్యాటకులతో సందడిగా దర్శనమిచ్చాయి.

చీకుధార వద్ద...

రాజవొమ్మంగి: మండలంలో ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తున్న కిమ్మిలిగెడ్డ అటవీప్రాంతంలోని చీకుధార వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఎక్కడెక్కడి నుంచో మోటారు సైకిళ్లు, వ్యాన్లు, ఆటోల్లో ఈ ప్రాంతానికి చేరుకొన్న సందర్శకులు జలకాలాడుతూ రోజంతా గడిపారు.

చాపరాయి వద్ద...

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతాన్ని సందర్శించేందుకు ఆదివారం మైదాన ప్రాంతం నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సమేతంగా సందడి చేస్తూ ఆనందంగా గడిపారు. అరకు–పాడేరు ప్రధాన రోడ్డు మార్గంలో నారింజవలస వద్ద పాంగి బుద్దు అనే రైతు పొద్దుతిరుగుడు పూల తోటలో పర్యాటకులు ఫొటోలు తీసుకుంటూ ఎంతో ఉల్లాసంగా గడిపాడు.

భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపం



ఆకాశదీపానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,డాక్టర్ నరసింగరావు దంపతులు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ఆకాశదీపం పూజలను ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు దంపతులు తొలిపూజ జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు రామం భక్తులతో పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో హేమలత,గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు,ఉపాధ్యాయుడు జంపరంగి ప్రసాద్ దంపతులు, ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు,ఆలయ కమిటీ ప్రతినిధులు బలరామ్‌మజ్జి, వుప్పల వెంకటరత్నం,కొట్టగుళ్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేడి చారు పడి బాలుడికి తీవ్రగాయాలు


గాయపడిన చిక్కం అవినాష్

అడ్డతీగల: మండలంలోని పెదమునకనగడ్డలో శనివారం రాత్రి వేడి చారు ప్రమాదవశాత్తు మీదపడి చిక్కం అవినాష్(6) అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం రాత్రి తల్లి లక్ష్మి పొయ్యిపై చారు కాస్తుండగా ఆడుకుంటూ అటుగా వచ్చిన అవినాష్‌పై చారు పడిపోవడంతో ఛాతీ,ఎడం చెయ్యిపై గాయాలయ్యాయి. బాలుడిని వెంటనే 108 వాహనంలో అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు తగిన చికిత్స చేసి, ఆదివారం డిశ్చార్జి చేశారు.

కేవీకేలో నేడు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

రంపచోడవరం: రంపచోడవరం సమీపంలోని పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో(కేవీకే) సోమవారం నుంచి మూడు రోజుల పాటు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నట్టు కెవీకె కో-ఆర్డినేటర్ డాక్టర్ లలితా కామేశ్వరి తెలిపారు. ఈ శిక్షణలో పుట్టగొడుగులు సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణ ముగించుకున్న వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన సలీమ్

చింతపల్లిరూరల్: లంబసింగి ఘాట్‌రోడ్డు వద్ద ఆదివారం కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో వ్యక్తికి కాలు విరిగిపోయింది. దీంతో ఆటోలో బాధితుడిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నర్సీపట్నంకు సమీపంలోని కైలాసపట్నానికి చెందిన ఎస్‌కే సలీమ్ ద్విచక్ర వాహనంలో లంబసింగి వస్తుండగా చింతపల్లి వైపు నుంచి నర్సీపట్నం వెళుతున్న కారు ఘాట్‌రోడ్డులో బలంగా ఢీ కొట్టింది. దీంతో అతని కుడి కాలుకు గాయం కావడంతో నర్సీపట్నం తరలించారు. దట్టంగా కురుస్తున్న పొగమంచు ప్రమాదానికి కారణమని బాధితుడి తెలిపారు.

కారడవిలో కాంతి రేఖలు

- అభివృద్ధి వైపు అడుగుజాడలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మార్పు కోరుకుంటున్న గిరిజనం
- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు


బూసికొండ గిరిజనులతో మాట్లాడుతున్న చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్


గాలికొండ గ్రామానికి వెళ్లే రహదారి

గూడెంకొత్తవీధి: అది అల్లూరి జిల్లా లోని అత్యంత మారుమూల ఉన్న గాలికొండ పంచాయతీ.. పేరుకు పంచాయతీ కేంద్రం అయినా ఇక్కడి గిరిజన గ్రామాలన్నీ శివారులో ఉండడంతో వెలుగు రేఖలకు నోచుకోలేదు. పైగా ఇది మావోయిస్టులకు కంచుకోటగా పేరొందడంతో ఈ ప్రాంతానికి కనీసం మండల స్థాయి అధికారులు సైతం వచ్చే వారు కాదు.. దీంతో ఆయా గిరిజనుల జీవితం అగమ్యగోచరంగా మారింది.. వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి వీరిది.. రహదారులు, రవాణా, తాగు, సాగునీరు, విద్య, వైద్యం వంటి కనీస మౌలిక సదుపాయాలకు దూరంగా బతుకీడ్చే పరిస్థితి.. అయితే ఇదంతా గతం... మారుతున్న కాలానికి అనుగుణంగా ఇపుడిపుడే గిరిజనుల జీవితాల్లో మార్పు కనపడుతోంది. ఇంతకాలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా పేరొందిన గిరి పల్లెల్లో ఆదివాసీలు అభివృద్ధిని కోరుకుంటున్నారు.

రహదారి నిర్మాణానికి ప్రభుత్వం చొరవ

గాలికొండలో రహదారి నిర్మాణం విషయంలో గతంలో మావోయిస్టులు పలుమార్లు అడ్డుచెప్పడంతోపాటు విధ్వంసాలకు పాల్పడడంతో గిరిజనులంతా మావోయిస్టులపై ఎదురుతిరిగారు. తమ గ్రామానికి రహదారి లేక అత్యవసర వైద్యం అందడం లేదని, రవాణా సదుపాయాలు లేక అనేక అవస్థలు పడుతున్నామని వారు తమ బాధలను ప్రకటించారు. దీంతో మావోయిస్టులు వెనకడుగు వేయడంతో గిరిజనులు తమ గ్రామానికి రహదారిని నిర్మించాలని ప్రభుత్వ అధికారులను కోరారు. స్పందించిన ప్రభుత్వం గాలికొండకు రహదారిని నిర్మించింది. ఈ నేపథ్యంలో గాలికొండ పంచాయతీ బూసికొండకు కనీస రహదారి సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గ్రామస్తులంతా కలిసి కొంతమేర శ్రమదానంతో రహదారిని నిర్మించుకున్నారు. మార్గ మధ్యలో రహదారి నిర్మాణానికి కొండగట్లు, బండరాళ్లు, కొండచరియలు అడ్డంకులుండడంతో వీటి తొలగింపునకు యంత్రాలు కావల్సి వచ్చింది. తమకు రహదారి విషయంలో సహకరించాలంటూ బూసికొండ గిరిజనులు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయాన్ని గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్ చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన ఏఎస్పీ చింతపల్లి నుంచి జేసీబీని ఏర్పాటుచేయడంతో పాటు దగ్గరుండి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. తమ ఊరి బాగు కోసం ముందుకు వచ్చిన గిరిజనులను ఈ సందర్భంగా ఏఎస్పీ అభినందించారు.

అభివృద్ధికి అండగా ఉంటాం



గిరిజనుల అభివృద్ధికి అండగా ఉంటాం. గిరిజనులకు సేవ చేయడానికే మేం పనిచేస్తున్నాం. ఈ విషయంలో తాము అన్ని వేళలా సిద్ధంగా ఉంటాం. వారికి ఏ అవసరం ఉన్నా నిర్భయంగా తమ వద్దకు వచ్చి తెలియజేయవచ్చు.
– ప్రతాప్‌శివకిషోర్, చింతపల్లి ఏఎస్పీ

తీరనున్న కష్టాలు

రహదారుల నిర్మాణం వల్ల గిరిజన ప్రాంతాల్లో అనేక మౌలిక సదుపాయాలు సమకూరుతాయి. ప్రధానంగా రవాణా సదుపాయలు అందుబాటులోకి వస్తాయి. అత్యవసర సమయంలో గిరిజనులకు వైద్యం వంటివి అందే అవకాశం ఉంటుంది. ఏళ్ల తరబడి ఉన్న గిరిజనుల కష్టాలు తీరనున్నాయి.
– బుజ్జిబాబు, సర్పంచ్, గాలికొండ

ఆదివాసీల హక్కుల పరిరక్షణే ధ్యేయం


మాట్లాడుతున్న లచ్చిరెడ్డి, పక్కన చిట్టిబాబు

వై.రామవరం: ఆదివాసీ హక్కుల పరిరక్షణే తమ ధ్యేయమని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని కె.యర్రగొండ గ్రామంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం ఆదివాసీ ఏడు ఉపతెగల ఐక్యత మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లచ్చిరెడ్డి మాట్లాడుతు ఏడు గిరిజన ఉపతెగలను ఒకే తాటిపై నడిపించడానికే ఈ మహాసభ ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసీల హక్కులు కాలరాస్తూ, వారిపై పెత్తనం చలాయిస్తున్న గిరిజనేతరుల చర్యలను సహించేది లేదన్నారు. ఇకపై నకిలీ గిరిజనులకు ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు, భూమి పట్టాలైన జారీచేస్తే అడ్డుకుంటామన్నారు. బోయ, బెంతు, ఒరియ తదితర కులాలను ఎస్టీలో చేర్చొద్దని, అర్హులైన ఆదివాసీలకు గ్రామసభల ద్వారా కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు మాట్లాడుతూ గిరిజన చట్టాలు, హక్కులపై ఆదివాసీలకు అవగాహన కల్పించారు. కొన్ని ప్రాంతాల్లో ఆదివాసీలు అణచివేతకు గురవుతున్నారని, యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం నిర్విరామంగా పోరాడుతున్నామని ప్రతిజ్ఞ చేశారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయ సంఘ నేత లక్ష్మణరెడ్డి, ఆదివాసీ కమిటీల నాయకులు త్రిమూర్తులు, లింగారెడ్డి, రాజారెడ్డి, సత్యనారాయణదొర, నరసన్నదొర, విశ్వరెడ్డి, భద్రం, పండు, మోహనరావు, చిన్నినారాయణ, సువర్ణకుమార్, జానుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

అరకు ఎంపీ మాధవి


చింతాలమ్మ తల్లికి పూజలు చేస్తున్న అరకు ఎంపీ మాధవి, చిత్రంలో భర్త శివప్రసాద్

కొయ్యూరు: ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. మండలంలోని చింతాలమ్మ తల్లి ఆలయం, నడింపాలెం-శరభన్నపాలెం మధ్యలో వెలసిన ఎర్రగొండమ్మ ఆలయాలను ఆమె కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ మాధవి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం వెలగలపాలెంలో ఆమె తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే దేముడు ఘాట్‌వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. దేముడు వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె శివప్రసాద్, గొడ్డేటి మహేష్, నేతలు పాల్గొన్నారు.

అనాథ బాలికను ఆదుకుంటాం

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర


బాలిక ప్రియాంకతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: అమ్మ లేదని కుమారుడు మృతి చెందడంతో పాటు కుటుంబంలో అందరూ చనిపోవడంతో అనాథ అయిన బాలికను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలోని సంతబయలులో ఒకరోజు వ్యవధిలో తల్లి, కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ బాధిత కుటుంబంలో అనాథ బాలిక ప్రియాంకను ఆదివారం పరామర్శించారు. బాలికతో మాట్లాడి ధైర్యాన్ని చెప్పి ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని, గృహం మంజూరు చేస్తామని బాలికను ఓదార్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర మాట్లాడుతూ కుటుంబంలో అందరూ చనిపోయి బాలిక అనాథగా మిగలడం తనను తీవ్రంగా బాధించిందన్నారు. వైఎస్సార్ బీమాను అందేలా, బాలికకు జీవన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామరు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబూరావు, తిరుపతిరావు, పులిరాజు, దాసు, రఘునాథ్ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బుల్లికృష్ణ

అరకులోయ రూరల్: చట్టాలపై విద్యార్థులకు అవగహన ఎంతో అవసరమని న్యాయ సేవాధికార సంస్థ విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జిల్లా జడ్జి బుల్లికృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు చట్టాలపై అవగహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే హక్కులు చట్టాలపై అవగాహన కలిగి ఉండలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్య అభ్యసించి, లక్ష్యాన్ని సాధించి, ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. ప్రిన్సిపాల్ ప్రమీల, ఎస్‌ఐ కుమార్‌బాబు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి భువనేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ రమణ, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై తేనెటీగల దాడి


తేనెటీగల దాడిలో గాయపడిన పుల్లారెడ్డి, పక్కన నరేష్‌రెడ్డి

కూనవరం: మండల కేంద్రంలో ఆదివారం ఇద్దరిపై తేనె టీగలు దాడిచేశాయి. ఒకరు వాటి బారి నుంచి తప్పించుకుని బయటపడగా, మరో వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వీఆర్‌పురం మండలం చొక్కనపల్లి గ్రామానికి చెందిన అందెల పుల్లారెడ్డి, తన అన్న కొడుకు చదల నరేష్‌తో కలిసి చేపల వేటకోసం ద్విచక్రవాహనపై కూనవరం వైపు వస్తుండగా శబరి బ్రిడ్జి సమీపంలో వారిపై తేనెటీగలు దాడి చేశాయి. వాటి దాడి నుంచి తప్పించుకునేందుకు నరేష్ బ్రిడ్జిపై నుంచి దూకి ఈదుకుంటూ వెళ్లి సురక్షితంగా బయటపడ్డాడు. తేనెటీగల దాడిలో తీవ్ర గాయాలపాలైన పుల్లారెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న కూనవరం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ వీరన్న,కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని పుల్లారెడ్డిని సమీప ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. పుల్లారెడ్డిని కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.

చిట్టంపాడు జలపాతం సందర్శన ప్రారంభం


జలపాతం వద్ద జెడ్పీటీసీ గంగరాజు, ఎంపీడీవో శ్రీహర్షిత్, సర్పంచ్ మోస్య

అనంతగిరి: పర్యాటకులను ఆకట్టుకునే అందాలు మన్యంలో ఎన్నో ఉన్నాయని, వాటిలో చిట్టంపాడు జలపాతం ఒకటని జెడ్పీటీసీ దీసరి గంగరాజు, ఎంపీడీవో శ్రీహర్షిత్ అన్నారు. మండలంలోని టోకూరు పంచాయతీ చిట్టంపాడు జలపాత సందర్శనను స్థానిక సర్పంచ్ మోస్యతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గంగరాజు, ఎంపీడీవో శ్రీహర్షిత్ మాట్లాడుతూ ప్రకృతి అందాల నడుమ జలపాతం అద్భుతంగా ఉందన్నారు.

'సాక్షి'కి అభినందన

జలపాతం అందాలను బాహ్య ప్రపంచానికి పరిచయం చేసిన 'సాక్షి'ని సర్పంచ్ మోస్య అభినందించారు. పర్యాటకశాఖ, ఐటీడీఏ స్పందించిన జలపాతం మరింత అభివృద్ధికి సహకరించాలని, దీంతో స్థానికంగా ఉంటున్న గిరిజనులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోని వైస్ సర్పంచ్ నర్సన్న, నాయకులు దోన్ను, సోము,పీసా కమిటీ సభ్యులు కళారాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో బాలింత మృతి


పార్వతమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ముంచంగిపుట్టు: మండలంలో కుమాడ పంచాయతీ పనసలపుట్టు గ్రామానికి నిక్కుల పార్వతమ్మ(25) అనే బాలింత రక్తహీనతతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పనసలపుట్టు గ్రామానికి చెందిన పార్వతమ్మ 20 రోజుల కిందట ఆడ శిశుకు జన్మనిచ్చింది. మొదటి నుంచి రక్తహీనతతో బాధపడుతున్న పార్వతమ్మ పరిస్థితి ఆదివారం ఉదయం విషమంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు రూడకోట పీహెచ్‌సీకి తీసుకువచ్చి, అక్కడ నుంచి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు.సీహెచ్‌సీలో వైద్య సేవలు అనంతరం అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తూ ఉండగా మార్గం మధ్యంలో మృతి చెందింది. దీంతో అంబులెన్స్‌లో పనసలపుట్టు గ్రామానికి మృతదేహాన్ని తరలించారు.రక్తహీనత వల్లే తన భార్య మృతి చెందిందని భర్త గణపతి రోదిస్తూ తెలియజేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు


సహాయక చర్యల్లో పాల్గొన్న స్థానికులు

అరకులోయ రూరల్: మండలంలో వజ్రాల మెట్ట మలుపువద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. డుంబ్రిగుడ మండలం గసభ గ్రామనికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం అరకులోయ మండలం చిన్నలబుడు పంచాయతీ తుడుం గ్రామంలో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లారు. తిరిగి స్వగ్రామం వస్తుండగా స్థానిక వజ్రాల మెట్ట మలుపువద్ద అదుపుతప్పి లోయలోకి ద్విచక్ర వాహనం దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కిల్లో మహేష్(18) అక్కడికక్కడే మృతి చెందగా, తాంగుల వేణుగోపాల్(19) తాంగుల జీనబంధు(17)కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సహకారంతో 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాలతో డుంబ్రిగుడ ఎంపీపీ బాక్క ఈశ్వరి, అరకులోయ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్ (శ్రీను),వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సింహాచలం,గురు సంఘటన స్థలానికి చేరుకుని మన్యప్రగతి చారిటబుల్ ట్రస్ట్ అంబులెన్స్‌లో మహేష్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే ఫోన్‌లో పరామర్శించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా గిరిజన యువతి మృతి

డుంబ్రిగుడ: మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ నందివలస గ్రామానికి చెందిన గెమ్మెలి సావిత్రి(19)అనే గిరిజన యువతి ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందినట్టు తెలిసింది. ఈ విషయంపై ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా యువతి మృతి సమాచారం తమకు అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. వివరాలు సేకరిస్తున్నామని, సోమవారం పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

కార్గో కొత్త పుంతలు!

- మరింత విస్తృతం కానున్న సేవలు
- ఫ్లిప్‌కార్ట్, సిమెంట్ కంపెనీలతో ఒప్పందాలు
- ఉత్తరాంధ్రలో ఇప్పటికే అందుబాటులో 42 డీజీటీలు
- డిమాండ్‌ను బట్టి మరిన్ని పెంచేందుకు ఆర్టీసీ సన్నాహాలు


ఆర్టీసీ కార్గో కంటెయినర్ (డీజీటీ)

సాక్షి, విశాఖపట్నం: సరకు రవాణాలో ఆర్టీసీ కొత్త పుంతలు తొక్కుతోంది. రోజురోజుకు వినియోగదారుల ఆదరణను చూరగొంటూ ఆదాయాన్ని పెంచుకుంటోంది. కార్గో సేవలను మరింత విస్తృతం చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఉత్తరాంధ్ర నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు 48 గంటల్లోపే సరకును డెలివరీ చేస్తోంది. కంటైనర్లలో రవాణా చేయడం వల్ల సరకు పాడవకపోవడమే కాదు.. కార్గో నాణ్యత కూడా దెబ్బతినే అవకాశం ఉండదు. ఇది వినియోగదార్లను బాగా ఆకట్టుకుంటోంది. తాజాగా ఆర్టీసీ అధికారులు ఫ్లిప్‌కార్ట్, బిర్లా వైట్, ఇతర సిమెంట్ కంపెనీలతో పాటు బిస్కెట్లు, ఆహార పదార్థాల తయారీ, కెమికల్స్ తయారీ సంస్థలతోను ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆయా సంస్థలు, కంపెనీల సరకును కోరుకున్న చోటకు బల్క్ ఆర్డర్లతో కంటైనర్ల (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు-డీజీటీల) ద్వారా రవాణా చేస్తున్నారు. అలాగే ప్లైవుడ్, బియ్యం, గోధుమపిండి, మందులు, ఆటోమొబైల్స్ విడిభాగాలు, వస్త్రాలు, దుస్తులు వంటివి ఎక్కువగా వీటిలో రవాణా అవుతున్నాయి. సరికొత్తగా హౌస్ షిఫ్టింగ్‌కు కూడా ఆర్టీసీ కంటెయినర్లను (డీజీటీలను) సమకూరుస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ విజయనగరం కార్గో జోన్‌లో 42 కంటెయినర్ డీజీటీలున్నాయి. వినియోగదార్ల ఆదరణ బాగుండడంతో ఈ సంఖ్యను మరింత పెంచనున్నారు.

ఆ బస్సుల్లో టన్ను సరకుకు జాగా...: అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో ఒక టన్ను లగేజికి సరిపడేందుకు వీలుగా జాగాను కేటాయిస్తున్నారు. వీటిలో ఒక నెల రోజుల పాటు రెగ్యులర్‌గా సరకు రవాణా చేసే వారికి తక్కువ ధరకే అంటే.. కిలోమీటరుకు రూ.3-4 చొప్పున కేటాయించే వెసులుబాటు కల్పించారు. ఇతర సంస్థల సరకు రవాణా చార్జీల కంటే ఈ ధర తక్కువ. ఆర్టీసీ సరకు రవాణాతో పాటు పార్సిల్ డెలివరీలోనూ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. దీంతో పార్సిల్/కొరియర్ బుకింగ్‌లు పెరుగుతూ ఆదాయాన్ని పొందుతోంది. విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ వద్ద ఉన్న పార్సిల్ బుకింగ్ కౌంటర్‌ను 24 గంటలూ తెరిచి ఉంచేలా ఆర్టీసీ అధికారులు ఇటీవల చర్యలు తీసుకున్నారు. దీనికి స్పందన బాగుండడంతో త్వరలో మద్దిలపాలెం, విజయనగరం, శ్రీకాకుళంలో 24/7 బుకింగ్ కౌంటర్ల ఏర్పాటుపై దృష్టి సారించారు.

ఆదాయం అదుర్స్: ఆర్టీసీ విజయనగరం కార్గో జోన్ పరిధిలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోనే ఈ కార్గో జోన్ ఆదాయంలో అగ్రభాగాన ఉంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు (ఆరు నెలల్లో) పార్సిళ్ల్స్ ద్వారా రూ.6.75 కోట్లు, సరకు రవాణా (డీజీటీ) ద్వారా రూ.3.28 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇదే సమయానికి గత ఏడాది పార్సిల్స్ ద్వారా రూ.4.67 కోట్లు, డీజీటీతో రూ.2.14 కోట్లను పొందింది. అంటే గత ఏడాదితో పోల్చుకుంటే పార్సిల్స్‌లో రూ.2.18 కోట్లు, డీజీటీలో రూ.1.14 కోట్లు పెరిగింది. ఆర్టీసీ కార్గో సేవలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని మరిన్ని కార్గో బుకింగ్ పాయింట్లను, కంటెయినర్ డీజీటీలను పెంచుతామని విజయనగరం జోన్ డీసీఎం కణితి వెంకట్రావు 'సాక్షి'తో చెప్పారు.